24032024-DIS-04_Layout 1 3/24/2024 1:17 AM Page 1



# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## జ్ఞానం

ఈ మనిషినెక్కడో చూసాను
చిరపరిచితమయిన ముఖమే
బస్టాండ్‌లో, మెట్రోలో, ఫుట్‌పాత్‌పైనా చూశాను
పాతబజార్ గల్లీల్లో లైబ్రరీ పుస్తకాల నడుమా చూశాను

చాలా దగ్గరగానూ దూరంగానూ
దట్టమయిన అడవిలో, విశాల మైదానంలో చూశాను

సురసుర మండే ఎండలో చిటపట కురిసే వానలో
గజ గజ వణికే చలిలో
తడుస్తూనే ముడుచుకునో ఉసూరుమంటూనే వుంటే
చూసాను

కానీ మబ్బులు కమ్మిన చంద్రుడిలా
పొగమంచు కమ్ముకున్న రహదారిలా
రూపం స్పష్టంగా కనిపించడం లేదు
ఆ ముఖం అందమయిందా కురూపా
చూసిన మనిషే తెలిసిన ముఖమే
ఎటూ పాలుపోక ఊరంతా తిరిగీ తిరిగీ
ఉసూరుమంటూ ఇల్లు చేరాను
ఎవరతను?
మెదట్లో పురుగు తొలుస్తూనే వుంది

అకస్మాత్తుగా నిలువుటద్దంలోకి చూశాను
అరె నేను చూసిన ముఖమిదే
చిరపరిచితమయిన మనిషితనే

నన్ను నేను తెలుసుకున్నా
నాలాంటివాళ్లూ అర్థమయ్యారు

పొరలు పొరలుగా తెరలుగా
'జ్ఞానం' వికసించింది



వారాల ఆనంద్
94405 01281

# రాజతరంగిణిలో భూ సేకరణ

ప్రాచీన భారత చరిత్రను అవగాహన చేసుకోవడం కష్టం. కానీ, అసాధ్యం కాదు. చరిత్రను కేవలం తేదీలు, దస్తావేజులు, విసుగెత్తించే ఘట్టాలతో గాకుండా సామాన్య జనంలో సైతం వేల ఏండ్లుగా సజీవంగా నిలిచే మహా కావ్యాలుగా (రామాయణం, మహా భారతం, భాగవతం), అతిశయోక్తులతో కూడిన పురాణాలుగా మనకు అందించడం వల్ల వాస్తవ చరిత్రను వాటినుంచి వేరు చేసి గ్రహించడం కష్టంగా మారింది. ఇందువల్ల ప్రాచీన భారతీయ రచయితలకు చారిత్రక రచనా స్పృహ లేదనే అపప్రద పుట్టింది. కానీ, మహాభారత యుద్ధానంతరం నుంచి కశ్మీర్ రాజవంశాల చరిత్రను మనకు అందించిన కల్హణుని రాజతరంగిణి ఇందుకు మినహాయింపు.

ప్రాచీన కశ్మీర్ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక జీవితాన్ని కల్హణుడు యథాతథంగా రాశాడు. అందువల్ల ప్రాచీన భారత ఇతిహాసాలను, మహా కావ్యాలను కేవలం కట్టుకథలని కొట్టివేయడం సరికాదు. అలాగని వాటిలో ఉన్నవన్నీ అక్షర సత్యాలు కాదు. క్రీస్తు పూర్వం 1184లో కశ్మీర్‌ను పాలించిన 3వ గోనంద రాజుతో మొదలుపెట్టి తాను రచనను ముగించిన క్రీ.శ.1149 వరకు చరిత్రను రాజతరంగిణిలో వివరించాడు. తన పూర్వపు రచయితల రచనలు, రాజ శాసనాలు, చారిత్రక దస్తావేజులు, రాజ దానపత్రాలు మొదలైనవి పరిశీలించి వాటిలోని అతిశయోక్తులను, పరస్పర విరుద్ధ అంశాలను తొలగించాకే నిజమైన చరిత్రను రాశానని కల్హణుడు చెప్పుకొన్నాడు. రాజ తరంగిణిని పరిశోధిస్తే ప్రాచీన భారతంలో అభ్యుదయకర అంశాలు ఎన్నో ఉండేవని స్పష్టమవుతుంది.

ప్రభుత్వ భూ సేకరణ చట్టాలు: సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ సంస్థలు, జాతీయ రహదారుల వంటి ప్రజా ప్రయోజనాల కోసం అవసరమైన భూములను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించి సేకరిస్తుంది. బ్రిటిష్ పాలకులు 1984లో తయారుచేసిన భూ సేకరణ చట్టం వ్యక్తుల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తప్పనిసరి భూ సేకరణ చేపట్టేది. మన దేశం స్వాతంత్య్రం పొందిన తర్వాత కూడా వందేండ్లకు పైగా ఇదే చట్టం అమల్లో ఉండేది. అయితే, దీని స్థానంలో 2013లో న్యాయమైన నష్టపరిహారం పొందే హక్కు, భూ సేకరణ, పునరావాస, పునః సమీక్ష చట్టం పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ చట్టం ద్వారా మూడు ప్రధానమైన మార్పులను ప్రభుత్వం భూసేకరణ చట్టంలో ప్రవేశపెట్టింది. బలవంతపు తప్పనిసరి భూ సేకరణ బదులుగా వ్యక్తులు, ప్రభుత్వం ఐచ్ఛికంగా పరస్పర ఒప్పందం ద్వారా కుదుర్చుకున్న ధరకు భూ సేకరణ చేయడం, భూ సేకరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించడం, భూములు కోల్పోయిన కుటుంబాలకు కేవలం ధన రూపంలోనే కాకుండా వారి కుటుంబ, సామాజిక, పర్యావరణ పరిసరాలకు అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో పునరావాసం కల్పించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ఇలాంటి అభ్యుదయకరమైన చట్టాన్ని తేవడానికి మనకు వందేండ్లు పట్టింది.

6వ శతాబ్దంలో భూ సేకరణ: మరి క్రీ.శ. 6వ శతాబ్దంలోనే మన దేశంలో ప్రజా ప్రయోజనాల కోసం భూ సేకరణలో ఎలాంటి పద్ధతి పాటించారో ఒక ఉదాహరణ చూద్దాం. క్రీ.శ. 724లో కశ్మీర్‌లో ప్రఖ్యాత మార్కండ దేవాలయాన్ని నిర్మించిన సామ్రాట్ ముక్తాపీడ లలితాదిత్యునికి పూర్వీకుడు చంద్రాపీడుడు. త్రిభువనస్వామి మందిర నిర్మాణానికి అనువైన స్థలంలో చంద్రాపీడుడు భూసేకరణ చేసిన విధానాన్ని కల్హణుడు రాజతరంగిణి 4వ తరంగం (54 నుంచి 76 శ్లోకాలు)లో విపులంగా వర్ణించాడు.



చంద్రాపీడుడు గుడిని నిర్మించతలపెట్టిన ప్రదేశంలోనే ఒక చర్మకారుని గుడిసె ఉంది. రాజాధికారులు ఎంత డబ్బు ఆశచూపినా రాజు నిర్మించదలచిన మందిరానికి అతను తన గుడిసెను ఇవ్వడానికి నిరాకరించాడు. అధికారులు తన స్థలంలోకి రాకుండా అడ్డుకున్నాడు. దాంతో వారు రాజుకు విన్నవించుకున్నారు. బలవంతంగా అతని గుడిసెను ఆక్రమించడానికి ప్రయత్నించినందుకు రాజు తన అధికారులనే తప్పుబట్టాడు. 'ముందుగా చర్మకారుని అనుమతి లేకుండా అతని నివాస స్థలంలో ప్రవేశించి అధికారులు ముందుచూపు లేకుండా ప్రవర్తించారు. తక్షణమే మందిర నిర్మాణాన్ని ఆపివేయండి. లేదా మరోచోట మందిరాన్ని నిర్మించండి. ఒకరి భూమిని బలవంతంగా లాక్కొని పవిత్రమైన మందిర నిర్మాణాన్ని ఎలా చేయగలం? ఏది న్యాయమో నిర్ణయించే మనమే అన్యాయంగా ప్రవర్తిస్తే, ఇక చట్ట ప్రకారం ఎవరు నడుచుకుంటారు?' అని ప్రశ్నించాడు.

మరుసటి రోజు చంద్రాపీడుడు ఆ చర్మకారుని రాజ భవనానికి పిలిచి 'నీకు నీ ఇల్లు అంతగా ఇష్టమైతే, దానికంటే పెద్ద భవంతిని గానీ, పెద్ద మొత్తంలో డబ్బుని గానీ కోరుకో. ఇస్తాను' అన్నాడు. అందుకు ఆ చర్మకారుడు బదులిస్తూ మహారాజా! మీకు మీ రాజభవంతి ఎంత ప్రీతిపాత్రమో నాకు నా మట్టి గుడిసె అంతే ఇష్టం. నేను పుట్టినప్పటి నుంచి నా కష్టసుఖాల్లో ఈ పూరి గుడిసె కన్నతల్లిలా సాక్షిభూతంగా ఉంది. దీన్ని నేలమట్టమవ్వడం నా కండ్లారా నేను చూడలేను. తాను నివసించే ఇంటిని కోల్పోయిన వ్యక్తి దురదృష్టాన్ని రాజ్యం కోల్పోయిన రాజు దురదృష్టంతోను, విమానంపై నుంచి పడిపోయిన వ్యక్తి దుస్థితితోను పోల్చవచ్చు. ఏదేమైనా, ఒకవేళ మహారాజా వారు నా పూరిగుడిసెకు స్వయంగా వచ్చి కోరితే సభ్యత పాటించి నేను నా ఇల్లుని ఇస్తానని' అన్నాడు. మహారాజు అతని కోరిక మేరకు అతని గుడిసెకు వెళ్లి అడుగగా చర్మకారుడు తన గుడిసెను తగిన ధరకు స్వాధీనం చేశాడు.



ఆనందేశి నాగరాజు

కల్హణుడు పేర్కొన్న చారిత్రక ఉదంతం ప్రభుత్వ భూ సేకరణలో న్యాయమైన నష్ట పరిహారం చెల్లించడం ఎంత ముఖ్యమో నిర్వాసితుల పట్ల ఉదారంగా, సానుభూతి, మానవతా దృక్పథంతో ప్రవర్తించడం అంతే ముఖ్యమని దిశానిర్దేశం చేసింది. మన ప్రాచీన చరిత్రలో మానవత్వాన్ని చాటే సంఘటనలు తెలుసుకొని గర్విద్దాం.



## బెత్తంతో సరిపోతుంది

తినకుండా ఉంటే
ఉన్నోడికి ఉపవాసం
లేనోడికి పస్తు!

పాపం పోవాలనో
పుణ్యం రావాలనో
ఉన్నోడి ఆలోచన!

అయ్యో రామ
అన్నం దొరకలేదే అని
పేదోడి ఆవేదన!

ఇద్దరికీ దేవుడొక్కడే
మరి ఈ వివక్ష ఏమిటో
చేసిన పాప పుణ్యాలా!

అయితే స్వామి!
తప్పులు చేయకుండా చూడలేవా
చేస్తే అప్పటికప్పుడే శిక్షించలేవా!

పాపాలను మూటగట్టి
నుదుటి మీద రాతగా రాస్తే
మానవుడికేమి జ్ఞాపకం!

ఎప్పటికప్పుడు శిక్షిస్తే
బెత్తంతో సరిపోతుంది
అన్నీ కలిపితే జీవితమైనా సరిపోతుందా!



జి. జగ్గయ్య
98495 25802

## మా ఊరి పానాది



ఊరికి కోసు దూరంల ఉన్న
మా గుడ్డం కాడికి పోవాలంటే
ఆ పానాదిల కెళ్లే పోవాలె
వానకాలంల పానాది నిండ
జాలువారే జాలు నీళ్లు
బండల కాడ కిందికి దూకుతుంటే
నీళ్ల గలగలల సప్పుడు
మంద్రస్థాయిలో పసందైన
సంగీతంలా వినిపిస్తుండె

పానాదికి ఇరువైపులా
గుబురుగా పెరిగిన చెట్లు
పైకెళ్లి జడలు ముడేసుకునుండె
పొద్దుగూకక ముందే చిమ్మచీకటి
ఇంటికి వస్తుంటే ఈడికి రాంగనే
దయ్యాలు యాదికి వచ్చేవి
దేవున్ని గట్టిగా తలుచుకుంట
పానాదిల పరుగు దీస్తుంటిమి

పానాది యెంబడి పరికి పండ్లు
తెంపుతుంటే పరికి ముండ్లు
నెత్తురు కండ్ల జూసేవి
చింత చిగురు, ఓనగాయ
దోర చింతకాయల రుచి,
ఎండకాలం ఈతగొలలు కోసి
తెంపిన ఈత పండ్ల రుచితో
పానాది పదిలమైన ఓ మధుర జ్ఞాపకం

పానాది పక్కన పారుతున్న ఒర్రె
అందరి దూప తీర్చేది
కాల్వల పారే నీరు
పశు పక్ష్యాదుల దూప దీరిస్తే
పక్కనే ఉశ్కెల చెల్మె దవ్వుకొని
మట్టినీరు కొట్టేసి పేరిన నీళ్లకు
మూతివెట్టి తాగి మేము
దూప దీర్చుకునేటోళ్లం

ఇప్పుడు పానాది తూడ్చుకుపోయింది
దాని జాగల రోడయింది
చెట్లు గొట్టేసి నున్నగ జేసినంక
దాని ఆనవాలే చెరిగిపోయింది
కానీ మా అద్భుత బాల్యంలో
అంతర్భాగం ఆ పానాది
మరచిపోని నా చిన్ననాటి యాది



గిరిమాజి దామోదర్
99663 36960



## నా సదువు

తట్టు బొంతల మీద పారుకుంటా
బలుపాల తోటి బస్కీలు తీసిన సదువు..
తాటి కమ్మల సందులకెల్లి
తరగతి గుడిసెలకు తరలివచ్చిన సదువు..
నల్లాలం బొగ్గుతోటి సోపతి గట్టి
'గట్టి'గ బోర్డు మీద ఎక్కిన సదువు..
ప్రశ్నలు జవాబుల తోటి పరేషాను గాకుంట
పతొక్క పాఠాన్ని పద్ధతిగా ముట్టిన సదువు..
సార్లెదురైతే మర్యాదకు సైకిలు దిగి
బుద్ధిగా సలాం జేసిన సదువు
సక్కటి సేతిరాత తోటి సూసిరాత కాపీల
నిత్తె గుడ్ లేపిచ్చుకున్న సదువు..
తప్పులు ఎల్లని భాష కోసం
ఎప్పుడు ఇమ్లు సెప్పిచ్చుకున్న సదువు..
కొనెల్ల లెక్కలు సక్కగుండాలని
ఎక్కాలాటలు ఆడిన సదువు..
పాత వయిలను సగం ధరకు కొని
పురాత సదూకున్న సదువు..
కోతి పనులు చేసినప్పుడు
కోదండం ఎక్కిన సదువు..
ఎండాకాలపు తాతిలల్ల సుతం
ఉండలేక వయిలు తెరవెట్టిన సదువు..
షురూ కెల్లి కొనాదాంక
సర్కారు బడికోయిన సదువు..
మా పల్లె నుంచి పట్నం దాంక
పయానం కట్టిన సదువు..



అల్లాడి శ్రీనివాస్
83416 63982

# గురుతర బాధ్యత గుర్తుచేసిన కవిత్వం

సమాజంలో ఏ మార్పులు జరిగినా అవి పిల్లలపై ప్రభావం చూపుతాయి. పేదరికం, సామాజిక వివక్షల వల్ల మొదట నష్టపోయేది పిల్లలే. పెద్దలు గ్రహించినంతగా పిల్లలు లోతు గ్రహించలేరు. అయినా, తమకున్న అవగాహన మేరలో పిల్లలే రాసిన రచనలున్నాయి. పిల్లల కోసం పెద్దలు రాసిన రచనలున్నాయి. అణిచివేతకు గురవుతున్న బాల్య జీవితం పట్ల బాధ్యతతో పిల్లలు-బడి కేంద్ర బిందువుగా పెద్దలు రాసిన రచనలున్నాయి.

అట్లా కందుకూరి శ్రీరాములు రాసిన 'పలకల నుంచి పలుకుల వైపు' కవితా సంపుటి వినూత్నమైంది. పిల్లల పట్ల బాధ్యతాయుతమైన అనురక్తికి నిలువెత్తు ప్రతిరూపం. పిల్లల హృదయం ఎంత నిర్మలంగా ఉంటుందో, అంతటి స్వచ్ఛదనంతో పిల్లల్లో పిల్లవాడై, పెద్దదిక్కయి, అనుభవజ్ఞుడై, చైతన్యం కలవాడై చలించిపోయి ఈ కవితలు రాశారు. విద్యకై వచ్చి విశ్వసేవకై అక్షర విల్లంబులు సిద్ధం చేసుకునే గురుతర బాధ్యతను కవి అక్షరబద్ధం చేశారు.




కవిత్వం రాస్తున్నప్పుడు ఏం చెప్తున్నామనే స్పృహ ఎంత ముఖ్యమైందో, ఎలా చెప్తున్నామనే ఆలోచన కూడా అంతే ముఖ్యమైంది. కవికి ఒక లక్ష్యం, ఒక విధానం ఉంటే ప్రయోజనం నెరవేరుతుంది. శ్రీరాములు కవిత్వానికి ఆ చేవ ఉన్నది. ఈ సంకలనంలో కవి బాల్యపు అనుభవాలు చిగురుకలలై నెమరువేసిన జాడలు లేకపోలేదు. తన బాల్యం వలె బడిపిల్లల బాల్యం ఎలా పోతున్నది, ఎలా భిన్నంగా ఉన్నది వంటి పరిశీలనలు బేరీజు వేసుకొని చూశారు. చిగురు కలలు ఏమిటివి? చెదిరిన చిగురు కలలు ఏమిటివి? తెలుసు కనుక 'కన్ను మీద కనురెప్ప పడ్డంత సున్నితం/ మట్టి పెళ్ల మీద తొలకరిపడ్డంత/ సునిశితం-సువాసనత్వం' గురించి రాయగలిగారు.

'బడి గంట కొట్టే వేళ విద్యార్థులను అలర్ట్ చేయటం అటెండర్‌కు తెలిసిన విద్య' అన్నారు కవి కందుకూరి శ్రీరాములు. గంట ఒక సూచన, హెచ్చరిక, బాధ్యతను గుర్తు చేయటం, కాలం విలువ తెలియచెప్పటం ఆ పనిని నిర్వర్తిస్తున్నది. అటెండర్‌ను ఆయన కావ్య వస్తువు చేశారు. ఈ కవితా సంకలనంలో కవిగా తాను మొదలైన తొలినాళ్ల 'పయనం' ఉన్నది. నందిని సిధారెడ్డి, కందుకూరి శ్రీరాములు, కర్నాల బాలరాజు కవులు ముగ్గురు కలిసి ప్రచురించిన 'దివిటీ' తొలి మినీ కవితా సంకలనంలోనూ ఈ కవిత ఉన్నది. ఇంటి చుట్టూ, పంట చుట్టూ, బడి చుట్టూ, గుడి చుట్టూ, ఊరి చుట్టూ, చెరువు చుట్టూ బాట నిండా ముండ్లే ఉన్నప్పుడు గమ్యం దూరమనో, మరో కారణమనో పయనాన్ని ఆపుకొని బతుకు ఆగం చేసుకోవటం కంటే 'ముళ్ల ప్రయాసనే నయం 'కాలికి గాయమైనా/ గమ్యాన్ని చేరగలం' అనే పరమార్థాన్ని ధీమానిచ్చారు. అలాంటిదే కే.శ్రీనివాస్‌తో కలిసి రాసిన కవిత లాంగ్ మార్చ్ 'చీకటి కోటపై దండయాత్రకు చేస్తున్న కవాతు టార్చ్ లైట్ వేసి దారిని చూపిస్తుంది'.

ఉపాధ్యాయుని వృత్తి విద్య బోధించటమే. జ్ఞాన ప్రసరణ చేయటమే. అంతకంటే ఇవ్వటానికి ఏముంటుంది. అలాంటి ఉపాధ్యాయుడి పట్ల గౌరవంగా ప్రవర్తించటం సంస్కారం. అందుకు భిన్నంగా కొందరు పర్యవేక్షకులు స్నేహపూర్వకమైన వాతావరణాన్ని కూడా విస్మరించి అత్యుత్సాహాన్ని చూపటమో, లేక మరే కారణం వల్లనో మనసు నొప్పించిన సందర్భాలు లేకపోలేదు. అలాంటి సందర్భం ఎదురైనప్పుడు కవి స్పందన ఎలా ఉంటుందో 'అక్షరబ్రహ్మలం' ఒక రుజువు. బోధనా వృత్తిలో వాళ్లందరి పక్షాన నిలబడి రాసినట్టుగా ఉంటుంది కవిత.

ఒక్కపూటైనా పస్తులుండటం తెలువని వారు ఆకలి గురించి చెప్పటం విడ్డూరంగానే ఉంటుంది. జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే కవి తనివి తీరా బతికి చూడమన్నాడు. అప్పుడే సంస్కారం అందుతుందని తన కవితకు సార్థకత చేకూరుతుందని కవి కందుకూరి శ్రీరాములు ప్రబోధం చేశారు. 'శిలను చెక్కితే', 'శబ్ద శరీరం', 'ఆకాశం అంచు', 'డోలాయమానం', 'రిక్త నేత్రాలు', 'రథాన్ని మళ్లించు లక్ష్మణా!' మొదలైన కవితలు ఒక క్షణం ఆపి ఆలోచింపజేస్తాయి.

ఒక్కపూటైనా పస్తులుండటం తెలువని వారు ఆకలి గురించి చెప్పటం విడ్డూరంగానే ఉంటుంది. జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే కవి తనివి తీరా బతికి చూడమన్నాడు. అప్పుడే సంస్కారం అందుతుందని తన కవితకు సార్థకత చేకూరుతుందని కవి కందుకూరి శ్రీరాములు ప్రబోధం చేశారు.

రైతు భూమిని, నాగలిని మొక్కి, వ్యవసాయం పనిలోకి దిగుతాడు. వృత్తుల వాళ్లు అలాగే పనిముట్లను మొక్కి, పని చేపడతారు. అవి అన్నం పెడుతున్నాయి కనుక అంతటి కృతజ్ఞతాభావం. అదే నమ్మకంతో కాగితాన్ని కాలితో తాకొద్దని మొక్కాలని పెద్దలు చెప్తారు. కానీ, చేతులే లేని విద్యార్థి కాలుతో రాస్తున్నాడు. అతడు, తన లోపలి బాధను దాచుకుంటూ అందరితో హాస్యంగా మెదులుతున్నాడు. ఆ సందర్భం ఒకటి కందుకూరి శ్రీరాములును తొలిచివేసింది. ఆ సంతోషం వెనుక ఉన్న దుఃఖాన్ని చూసి ఆర్ద్రమై కవిత రాశారు. వస్తువుకు కొదవలేదు. వస్తువు చుట్టూ శిల్పం కఠిన వాస్తవాలను దర్శింపజేస్తుంది. ఇట్లా 'పలకల నుంచి పలుకుల వైపు' సంపుటిలో జీవితంలోని వర్తమాన అంశాలున్నాయి. కనుక పలకకు ఒకవైపు వర్ణమాల దిద్దుకోవటం అయితే మరోవైపు జీవితం ఉన్నది.

అట్లానే ఉపాధ్యాయ సేవాకాలంలో మనసుకు తాకిన గాయాలు కవికి ఉన్నాయి. అందుకే.. 'చదవటమూ నేర్పటమూ నేరమైన కాలంలో/ ఆచార్యుడు అనాగరికపు ఉన్మాదికి బలి అవుతాడు.' అని వాపోయాడు. చాలా సూటిగా స్పష్టంగా సరళమైన పదాలతో మన హృదయాన్ని తాకుతాడు. ఎవరు ఎంత ఎగిసిపడ్డా, ఎవరు గుర్తించకపోయినప్పటికీ, ఉపాధ్యాయుడిని పిల్లలు గుర్తుంచుకుంటారు సమాజం గుర్తుంచుకుంటుంది. ఇప్పటికీ కందుకూరి శ్రీరాములును పిల్లలు ప్రేమగా పలకరించటం నాకు తెలుసు. బహుశా ఆ అనుభవంతోనే 'చచ్చినా బతికినా/ ధర పలికేది విలువ దక్కేది/ ఒక ఏనుగుకి, ఉపాధ్యాయునికి' అంటూ అత్యున్నత స్థానాన్ని కవి కల్పించారు.

మరొకచోట 'ఉదయం ఆగదు ఉద్యమం ఆగదు' అన్నారు. కవిత్వం 'పిడక కాదు పిడకలో మెరిసే నిప్పు' అన్నాడు. 'అహం భావం బుల్డోజర్/ ఎందరి జీవితాలను బలి గొంటుందో/ అధికారం లాంటి/ ఎందరి ఆలోచనలను పగుల గొడుతుందో' అని కలత చెందిన కవి అక్షరాల సైన్యాన్ని తయారు చేసుకున్నారు. ఆ అక్షరాలే ఆయుధాలై కాగితం నిండా తల ఎత్తుకొని పహారా కాస్తాయని కవి నమ్మకం.



బెల్లంకొండ సంపత్ కుమార్
99085 19151